# మేలుకున్న మానవీయత

**మా** ఇంటి పనిమనిషి మహా అందగత్తె! ఓల్డెన్ డేస్‌లో తెలుగు సినిమాల్లో హీరోయిన్ కాంచనమాలలాగ వుంటుంది. మనిషి అవయవపుష్టితో కుదిమట్టంగ వుంటుంది.

చూసేవాళ్ళకు ముచ్చటేస్తుంది. ముద్దొస్తుంది!

చెప్పినవి చెప్పనివీ అన్ని పన్లూ శుభ్రంగ చకచకా చేసుకుపోగల సమర్థురాలు! వర్క్ పట్ల కమిట్‌మెంట్ వుండే సర్వెంట్‌మెయిడ్స్ దొరకటం ఈ రోజుల్లో చాలా అరుదు.

అందునా తెలుగు సినిమాలు బాగా చూసే అలవాటు వుందేమో... మధ్య మధ్య పాటల ట్యూన్ కూనిరాగాలు తీస్తూ హమ్మింగ్ చేస్తూంటుంది. పిల్లాజల్లా లేని మనిషిలా అన్పిస్తుంది. వయసు సుమారు పాతికేళ్ళుండచ్చు!

మెళ్ళో తాళి... కాలికి మట్టెలు వగైరా గుర్తులేమీ ఆమెలో కన్పించకపోవటంతో పెళ్ళి అయియుండదనే నిర్ణయానికొచ్చాం ఇంట్లో వారందరం!

ఇంట్లో మగ పురుషులతో (మగ పురుగులు) అంటే... తాతగారు... డాడీ... డిగ్రీ చదివే నేను ఒకరికి తెలీకుండా మరొకరు పనిమనిషికి సైట్ కొట్టటం ప్రారంభించాం!

ఎవరి ట్రయల్ ఫలిస్తుందో? ఎవరికి అదృష్టం కలిసొస్తుందోని మా ముగ్గురిలో వుత్కంఠ!

పనిమనిషి పేరు లాలిత్యని అమ్మ చెప్తే అందరం విని పళ్ళికిలించాం. ఆహా!... ఎంత లలితమైన నేమ్ అన్పించింది. పేరులో ఎంతటి మాధుర్యం దాగివుందీ? రూపసి అయిన ఆమెకు ఆ పేరు సరిగ్గా సరిపోయింది.

మా మమ్మీ వఠి పిచ్చిది. పాతకాలపు మనిషి! ఆమె దృష్టిలో ఇంట్లో మగాళ్ళంతా హరిశ్చంద్రులు. ధర్మరాజులు. ఎవరినీ ఏ విషయంలోనూ అనుమానించదు. అందరిమాటలూ నమ్మేస్తుంది.

నాన్న సరేసరి! మనిషి బహు గడుసరి! అంతా లోపలి మనిషి! ఏ విషయంలోనూ బైటపడడు. దేన్నీ బైటికి తెలియనీయడు! అంతా గుంభన!.

డాడీకి ఆడపిచ్చి జాస్తి అనే విషయం ఇంట్లో వారెవరికీ తెలీదు నాకు తప్పించి! ఆడ పదార్థం (ఏ వయసులోని వారైనాసరే) కన్పిస్తే డాడీ పళ్లు పులుస్తయ్. వళ్ళు జలదరిస్తుంది. కళ్ళు నాట్యం చేస్తయ్. మనసు అనుభవించేస్తూంటుంది. వెరీ పెక్యూలియర్ హ్యూమన్ బీయింగ్!

తాతగారేమో డిఫెన్స్‌లో ఆఫీసర్ వుద్యోగం వెలగబెట్టి రిటైరైనాడు. వయసు అరవై

పైబడ్డా... ఆర్మీ (ఎక్స్) మనిషి కావటంతో ఆరోగ్యంగ దృఢంగా వుంటాడు. శేరు బియ్యపు అన్నం అవలీలగా లాగిస్తాడు. బొచ్చు పీకిన కోడిని ఫ్రైచేస్తే ఒక్కడే తినేసి హరాయించుకోగల సత్తా (శక్తి) వుంది. మిలట్రీ వాడు కదా... ఆడవాసనలకు ఏళ్ల తరబడి దూరంగ ఉండి ఏడవటంతో... అందమైన లేదూ ఒక మాదిరి ఆడమనిషి (లేదూ పిల్ల) కంటపడితే చాలు వళ్ళంతా కళ్ళు చేసుకు చూస్తాడు. నమిలి పిప్పిచేసి వుమ్మేస్తాడు.

ఇక నానమ్మ విషయానికొస్తే... ఆమెకి చిన్న వయసులోనే చూపు మందగించటంతో సోడాబుడ్డీ కళ్ళద్దాలు పెట్టుకోవటం మొదలైంది. చూపు ఆనదు. ఏదీ సరిగ్గా కన్పించి ఏడవదు. అంచేతే... తాతగారు ఆడింది ఆట పాడింది పాట! ఆయన దెబ్బకి ఎదురులేకుండా పోయింది. తాతగారు రిటైర్మెంట్ పుచ్చుకోకముందే పక్షవాతమొచ్చి కాలు చెయ్యి పడిపోయింది. వీల్ ఛైర్లో ఇంట్లో... గార్డెన్లో తిప్పాల్సిందే ఆమెను.

ఇక నా విషయానికొస్తే... నేను దేవాంతకుడ్ని. అమ్మాయి కన్పిస్తే చాలు అమాంతం మింగేయాలన్పిస్తుంది. సూప్‌లో చికెన్ ముక్కల్లా నంజుకు తినేయాలని వుంటుంది. ఆడకసి ఎక్కువ!

నాకంటిచూపు నుండి ఏలేడి (లేడీ) పిల్లా తప్పించుకోవటం అసాధ్యం! మాటల్తో బురిడీ కొట్టిస్తాను. ఆశలు రేకెత్తిస్తాను. ఆకాశానికి ఎత్తేస్తాను. అంతే... ప్లాటై పడిపోవాల్సిందే! 'నన్ను మించిన మొనగాడే లేడమ్మా'ని పాట పాడుకోవల్సిందే! ఈ సొసైటీలో నావంటి వాళ్ళుండి తీరుతారనే వుద్దేశంతోనే కవిగారు ఆ సినిమాపాట రాసి వుంటాడనిపిస్తుంది.

అందునా... అందంగ హీరోలా వుంటానేమో అమ్మాయిలు నా ఫ్రెండ్‌షిప్ కోసం ఎగబడుతూంటారు.

ఇంట్లో నన్నందరూ 'మాటల పోచికోలు' అని ముద్దుగా పిలుస్తుంటారు.

ఎలాంటి అవలక్షణాలున్నా... చదువులో ఫస్టే!

ఆస్తిపాస్తులున్న అవిభక్త కుటుంబం మాది! యాభై ఎకరాల పొలం... ఇంట్లో పాతిక కేజీల బంగారు ఆర్నమెంట్స్... పదిలక్షలకు పైగా డిపాజిట్స్... షేర్స్‌లో ఇన్వెస్ట్‌మెంట్స్ వున్నయ్.

పనిమనిషి మా ఇంట్లో అన్ని పన్లూ చేయాలి. అడిగినంత జీతమిస్తాం! రెండుపూటలా తిండి పెడతాం. ఏడాదికోసారి చీరెసారె పెడుతుంది మమ్మీ. పనిమనిషైనా ఇంట్లో మా మనిషిగానే చూచుకునే స్వభావం మమ్మీది!

నేను పుట్టి బుద్ధి ఎరిగేక ఎవరు మా ఇంట్లో పనికి కుదిరినా వయసు మళ్ళిన

ముసలాళ్ళే! నాలుగైదేళ్ళపాటు చేశాక బోర్ కొడుతుందో ఏమో ఠక్కున మానేస్తారు. మళ్ళీ కొత్త పనిమనిషి కోసం వెతుకులాట!

లేటెస్ట్‌గ కుదిరిన పనిపిల్ల... అంటే యంగ్ హీరోయిన్ లాలిత్యే! సారీ కుమారి లాలిత్య!!

లాలిత్య డ్యూటీలో చేరిన ఫస్ట్ డేన లంగా ఓణీలో వచ్చింది. రెండవ రోజు సల్వార్ కమీజ్ డ్రెస్‌లో దర్శనమిచ్చింది.

వామ్మో! మంచి టేస్టున్నపిల్లే అనుకుని ముక్కున వేలేసుకున్నామందరం. ఈ లెక్కన నెలకి మేమిచ్చే వెయ్యి రూపాయల జీతం పాపం ఏ మూలకీ? అన్పించింది.

నా మటుకు నాకు లాలిత్యతో సాన్నిహిత్యం ఏర్పడ్డాక జీన్స్ డ్రెస్ కొనివ్వాలన్పించింది. మా తాతగారికేమో మగ్గంమీద నేసిన నేత చీరె కొనివ్వాలన్పించింది. బహుశ డాడీకి కంచి పట్టుచీరె కొనివ్వాలనుకుంటున్నాడేమో? డేటే లేదు.

పదేళ్ళపాటు మా ఇల్లు వదలకుండా రెక్కలు ముక్కలు చేసుకు చాకిరీ చేసిన పాపాయమ్మ మొగుడు పెట్టే హింస భరించలేక ఆత్మహత్య చేసుకోవటంతో... కొత్త పనిమనిషి కోసం సెర్చ్‌లైట్ వేసి గాలిస్తూండగా... లాలిత్య దొరికింది! సారీ కొత్తగా పనికి కుదిరింది!

లాలిత్య పూర్తిగా 'రాహేండ్'! అంటే ఇనెక్స్‌పీరియన్స్‌డు! ఇదే ఫస్ట్ పిక్చర్! మా ఇంట్లోనే హీరోయిన్ ఛాన్స్ తగిలింది!

అంత ఫ్రెష్!

★ ★ ★ ★ ★

తననెవరూ గమనించటం లేదని గ్రహించి పిల్లిలా అడుగులో అడుగు వేసుకుని నడుస్తూ మేడమీద బెడ్‌రూమ్‌లో కెళ్ళాడు తాతయ్య!

లాలిత్య చీపురుతో గది పూడ్చటం గమనించి... పాతకాలపు సరసం ఆమెతో ఆడేందుకు సాహసించి ఆ మాట ఈ మాట చెప్తూ నవ్విస్తూ... కుళ్ళు జోకులేస్తూ... తనూ పకపకా నవ్వుతూ మిలట్రీలో తాను సాధించిన ఘనవిజయాలు ఏకరువు పెడుతూ లాలిత్యను సమీపించి ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుని ఠక్కున అయిదు వందల నోటు వుంచినా... లాలిత్య కంగారు పడిపోయి కేకలేయిలేదు... పోనీలే పెద్దవాడు తనకూ తాతయ్య వరసైనవాడు కదాని! సైలెంట్‌గ వుండిపోయింది.

ఈ వ్యవహారమంతా కిటికీ సందుల్లోంచి పొంచి చూస్తూ 'అమ్మ తాతయ్యా! ఫస్ట్ ఛాన్స్ నువ్వే కొట్టేసే ప్రయత్నంలో వున్నావా?...' అనుకున్నాను.

ముసలాడివి నీకే ఇంత వెంపర్లాట వుంటే... ఇక నావంటి యంగ్ హీరో మాటేమిటి?

అనుకుంటూ బెడ్‌రూమ్‌లోకి ఎంటరవటం చూచిన తాతయ్య తొట్రుపాటుతో 'నువ్వెందుకొచ్చావురా? నీకు ఇక్కడేం పని?-' అనేసి దీర్ఘాలు తీశాడు.

అదురు బెదురులేని లాలిత్య గది క్లీన్ చేసే పని అయిపోవటంతో చీపురుతో ఎగ్జిట్ అయింది!

'సారీ తాతయ్యా... కథ మాంచి రసపట్టులో వుండగా వచ్చినట్టున్నాను...'

'నీ రూమ్‌లో కూర్చుని బుద్ధిగా చదువుకోక... ఇక్కడికెందుకొచ్చినట్టు?-' మాంచి ఛాన్స్ మిస్సైందనే బాధ తాతయ్య మాటల్లో ప్రస్ఫుటమైంది.

'ఇందులో ఏముందీ? ఎవరి ట్రయల్స్ వారివి. నే వెడుతున్నాలే...' అన్చెప్పి కిందకొచ్చాను.

నా చూపులకు దొరికి పోయాడనే భయంతోనో ఏమో నాగదిలో కొచ్చిన తాతయ్య 'నీ పాకెట్ మనీ కింద ఇది వుంచు...' అంటూ వెయ్యి రూపాయలు నోటు నాకు అందించాడు.

'నో! నాకొద్దు. అర్జంటుగా ఓ పదివేలు కావలసి వచ్చింది. అప్పుగా ఇస్తావా?-' నా డిమేండ్ తాతగారి ముందుంచాను. ఇరకాటంలో పెట్టాను.

'అమ్మో! పదివేలే?... అంతెందుకురా?- నా బాకీ ఎట్లా తీరుస్తావ్?-'

'నాకు వుద్యోగం వస్తుంది కదా? అప్పుడు తీరుస్తాను...'

'అప్పటివరకు నేను బతికి వుంటే గదా?-'

'ఛ! అవేం మాటలు తాతయ్యా! ఇంకా ఎన్ని ఘనకార్యాలు చెయ్యాలో నువ్వు! మరేం భయంలేదు... నువ్వు సెంచరీ కొడతావ్...' ఎక్కేసాను.

ఏమనుకున్నాడో ఏమో వెనక్కెళ్ళి తిరిగొచ్చి పదివేలు నాదోసిట్లో వుంచాడు.

'చూడూ! నువ్వు నా విషయంలో తలదూర్చి నా పన్లకు అడ్డంరాకు...' భావగర్భితంగా వార్నింగ్ ఇచ్చాడు తాతయ్య..

★ ★ ★ ★ ★

సడన్‌గ మా డాడీ కూడా నాకు చిక్కాడు! మనిషి మితభాషి అన్నమాటే గానీ క్రియాశీలుడు!

తాతయ్యేమో వీధిలో కెళ్లాడు... పెన్షన్ బాంకనుండి డ్రా చేసుకొచ్చుకోవడానికి.

నానమ్మ ఇంట్లో వున్నా లేనట్టే! మమ్మీ దేవుడి గుడికెళ్ళింది. ఓ రెండు గంటలదాకా రాదు.

పాపం!... నేను ఇంట్లో వున్నానో లేదో డాడీ కన్ఫరమ్ చేసుకోకుండానే సాహసో

పీతంగా కార్యోన్ముఖుడైనాడు.

లాలిత్యతో సరసానికి దిగేడు. పండక్కు చీరె కొనుక్కో! ఇది వుంచు రెండు వెయ్యినోట్లు ఇవ్వబోయాడు.

డాడీ చర్యకు బెదిరిపోయింది!

'అమ్మో! అమ్మగారికి తెలిస్తే నన్ను పన్లోంచి తీసేస్తారండీ! నా నోటిముందు కూడుపోతుంది! నా నోట్లో మట్టి కొట్టకండి సార్!...' దీనంగ వేడుకుని రివ్వున పెరటిలోకెళ్ళింది.

నా అడుగుల చప్పుడు విని 'నువ్వెందుకొచ్చావురా ఫూల్! కాలేజికెళ్ళలేదా?-' సీరియస్సైనాడు డాడీ.

అమ్మ దొంగడాడీ... ఇదా ఇంట్లో వుండి నువ్వు చేస్తున్న పని?!- నీ సంగతి చూస్తాలే అనుకుంటూ స్పాట్‌లోనుంచి నిష్క్రమించాను.

నా రూమ్‌లోకి వెళ్ళగానే తడిగుడ్డతో లాలిత్య నేల తుడవటం కన్పించింది.

రియల్లీ ఐయామ్ లక్కీ అనుకున్నాను.

'నువ్వేం చదువుకున్నావ్?-' మాటల్లోకి దించే ప్రయత్నంలో అడిగాను.

'బి.ఏ. పాసైనాను...'

'ఓసినీ... అంత చదువు చదివి... ఈ ముష్టి పనికెందుకొచ్చావ్?-' నివ్వెరపోతూ ప్రశ్నించాను.

అమ్మో!... పనివాళ్ళలో కూడా హైలీ ఎడ్యుకేటెడ్ వుంటారా అన్పించింది.

'నాకు డాడీ లేడండీ! మేస్త్రీ పనిచేసేవాడు. పనిలో వుండగా మూడో అంతస్తునుంచి కాలుజారి కిందపడి అకస్మాత్‌గ చనిపోయాడు. మా మమ్మీ అవిటి మనిషి! కష్టపడలేదు. నన్ను నా పోలీస్ మామ చదివించాడు. మా కుటుంబాన్ని ఆదుకున్నాడు. దానికి తోడు నాకు మెరిట్ స్కాలర్‌షిప్ కూడా తోడపటంతో చదువుకు గండిపడకుండా డిగ్రీ చేతికి తీసుకున్నాను' నేల తుడుస్తూనే... వంచిన తలపైకెత్తకుండా కహానీ అంతా చెప్పింది.

'పోనీ... ఏదైనా జాబ్ ట్రై చేసుకోవచ్చుగా?-'

'ఎన్నో అప్లికేషన్లు పెట్టాను... ఎన్నో ఎగ్జామ్స్ రాసాను. అదృష్టం కలిసిరాలేదు... అందుకే కష్టించి పనిచేయటంలో తప్పులేదనిపించి మీవంటి మంచి మనుషులున్న ఇంట్లో పనికి కుదిరాను...'

చచ్చాంరా దేవుడా!... మేమంతా మంచి వాళ్ళమని కితాబిచ్చిందేమిటి?- మేమెంత వెధవలమో... అవకాశవాదులమో... మేకవన్నె పులులమో... గ్రహించలేకపోయింది పూర్ గరల్... అనుకున్నాను మనసులోనే!

లాలిత్యతో రొమేన్స్ చేయాలన్పించలేదు. నా కలుషితమైన ఆలోచన్లను దూరం చేసుకుని సిగ్గుతో వెనుదిరిగాను.

★ ★ ★ ★ ★

'అమ్మగారూ!... నేను పని మానేస్తానండీ?-' లాలిత్య సడన్‌గ బాంబుపేల్చింది ఒకరోజున.

'నీ దుంపతెగిపోను... నీకిదేంపాడు బుద్ధే?... చేస్తూ చేస్తూ మానేయటం దేనికి?... నేనిచ్చే జీతం చాలటంలేదా? పోనీ మరో అయిదొందలు పెంచుతాను. మా ఇల్లు మానుకోకే పిల్లా...' దువ్వింది అనసూయమ్మ.

పనిమనిషి మానేస్తే... మళ్ళీ కొత్త మనిషి దొరకటానికి ఎన్నాళ్ళు పడుతుందో?... ఎట్లాంటి వాళ్ళు తారసపడతారో?... అంతవరకూ ఇంటెడు చాకిరీ చేయలేక తన చావుకొస్తుందనుకున్న అనసూయమ్మ మనసులో తనను తాను నిందించుకుంది.

'అదికాదండీ... మరి... మరే...'

'నీ మనసులో మాటేదో చెప్పేడు...' అంది.

'ఆ పిల్లనలా తిట్టకే?... మంచిపిల్ల! లాలిస్తూ దువ్వుతూ అడగరాదూ?...' అనసూయ భర్త అటుకేసి వచ్చి కలుగజేసుకుంటూ అన్నాడు.

'మమ్మీ! లాలిత్య వట్టి పనిమనిషి కాదే... డిగ్రీ పిల్ల తెలుసా?... బి.ఏ. పాసైంది. ఖర్మ బావుండక మన ఇంట్లో పనికి కుదిరింది...' యదార్థాన్ని డిక్లేర్ చేశాను.

నామాట విన్న అందరూ నివ్వెరపోయారు. ఇంత గొప్ప చదువు చదివిన పిల్లతోనా తామిన్నాళ్ళూ దరిద్రపు పన్లన్నీ చేయించుకుంటోంది... తనను తాను నిందించుకుంది అనసూయమ్మ.

సస్పెన్స్‌ని తొలిగిస్తూ 'రేపు మంగళవారం అష్టలక్ష్మి దేవాలయంలో నా పోలీస్ మామతో పెళ్ళి నిశ్చయమైందమ్మా! ఇక ఎక్కడా పని చేయాల్సిన అవసరంలేదు. మా అమ్మ కూడా మాతోనే వుంటుంది పెళ్ళి అయ్యాక కూడా... ఇన్నాళ్ళూ మీరు చూపిన అభిమానాన్ని మర్చిపోలేను...' అంటూ నెలజీతం అందుకుని వెనుతిరిగింది!

సిగ్గుతో కుంచించుకుపోయిన మగాళ్ళం ముగ్గురమూ చేసిన తప్పుకు మనసులోనే లెంపలేసుకున్నాం!

- సమాప్తం -